571) దేసాక్షి / హుసేని

ప॥ వట్టి సిగ్గులిక నేల వనితల యెదుటకు। వెట్టదీరనేరము తెరవేతుమా యిద్దరికి॥

చ॥ పలుకు దేనెల విందు పచ్చిమోవి బాగాలు। కలిగె నేడునీకు గాంతలవల్లను।
పులక పువ్వులసేస బుసకొట్టు సురట్లు। నెలత చేకొనె నిదె నీవల్లను॥

చ॥ సిరులనవ్వుల గందాలు చెమటలపన్నీరు। దొరకె నేడు నీకు తొయ్యలివల్ల।
సరసపు బొంతనాలు సళుపుగోరి సొమ్ములు। నిరతి నాపెగూడె నీవల్లను॥

చ॥ గబ్బి బొమజంకెనలు కళల మేనుంకువలు। అబ్బెను నేడు నీకు నంగనలవల్ల।
గొబ్బున శ్రీవెంకటేశుకూడితివి జవ్వనికి। నిబ్బరపు తమినిండె నీవల్లను॥